## నేరాల అదుపులో కీలకపాత్ర పోషించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని ఏఎస్పీ చెన్నయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని మెడికల్ కళాశాలలో సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు కొన్ని జాగ్రత్తలు పాటించటం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని, తక్షణ సాయం కోసం 100కు డయల్ చేయాలన్నారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు సునంద, రమాదేవి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మండల పూజా మహోత్సవాలు

కేసముద్రం, నవంబర్ 8: ఈనెల 16 నుంచి డిసెంబర్ 27 వరకు మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో మండల పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రధాన తాంత్రి విష్ణు నారాయణపొట్టి ఆధ్వర్యంలో మహాగణపతి హోమం, ధ్వజారోహణం, పుష్పాభిషేకం, ద్వార బంధనం, మహా పడిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. 41రోజులపాటు అయ్యప్పస్వామి మాల ధరించిన స్వాములకు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంప్ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఏమైనా ఓటరు సమస్యలు ఉన్నా సవరణ చేసుకోవచ్చని తెలిపారు.

## పశువుల పెంపకానికి బ్యాంకు రుణాలు

మహబూబాబాద్ రూరల్/ డోర్నకల్, నవంబర్ 8 : పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు పెంచే రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా బ్యాంకు రుణాలు పొందవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి భూమి లేకున్నా కోళ్ల పెంపకానికి, పాడి పశువులకు ప్రతి రైతుకు రూ.లక్షా 60వేలు రుణంగా పొంద వచ్చు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలని డోర్నకల్ మండల పశు వైద్యాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా రుణం మంజూరు చేస్తారని తెలిపారు. అప్లికేషన్ ఫారంతోపాటు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, పాన్‌కార్డు జిరాక్స్ జత చేసి ఇవ్వాలని సూచించారు.

## బొలేరో ఢీకొని యువకుడి మృతి

గూడూరు, నవంబర్ 8: బొలేరో ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లికి చెందిన గుర్రం సంజయ్ (20), మచ్చర్లకు చెందిన కప్పల బన్నీ గురువారం సాయంత్రం గూడూరు నుంచి తమ ఇళ్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో గూడూరు సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలేరో ఢీకొట్టడంతో ఎగిరిపడ్డారు. అటుగా వెళ్తున్న వారు క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీలో చేర్పించారు. వీరిలో సంజయ్ మార్గమధ్యలో మృతిచెందగా, బన్నీని మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు. మృతుడి తండ్రి గుర్రం మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పాఠశాలకు మ్యాట్ బహూకరణ

ఇనుగుర్తి, నవంబర్ 8: స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదివిన 2004–2005 పూర్వ విద్యార్థులు పాఠశాలలోని స్టేజీకి శుక్రవారం రూ.25వేల విలువైన మ్యాట్ బహూకరించారు. పూర్వ విద్యార్థులు వడ్డెపల్లి సదానందం, మట్టపల్లి అశోక్, సుంకరి శివ, గాడుదుల లింగయ్య, సుంకనపల్లి సంతోష్ పాల్గొన్నారు.



మ్యాట్ బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు























